సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 27 । మార్చి । 2023



వాణిజ్య ప్రయోగాల్లో అ'ద్వితీయం'

వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగంలో ఇస్రో మరోసారి విజయకేతనం ఎగురవేసింది. జీఎస్‌ఎల్‌వీ (ఎల్‌వీఎం–3– ఎం3) రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,480
3 శాతం జీఎస్టీతో..	రూ.5,644
సవర (8 గ్రా)	రూ.45,152

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /26.5

ఆదివారం గాలిలో 77 శాతం తేమ ఉంది. సోమవారం జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.



న్యూస్‌రీల్

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మహేష్



నూతన కార్యవర్గంతో వివిధ క్రీడా సంఘాల నాయకులు


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నెల్లూరులోని ఓ హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శిగా కె.గురుప్రసాద్, కోశాధికారిగా ఆనం రామకిశోర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది పులిమి అయ్యప్పరెడ్డి, పర్యవేక్షకులుగా అసోసియేషన్ తరఫున జి.శశికాంత్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరఫున డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ ఆర్కే ఎతిరాజ్ వ్యవహరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, కార్యదర్శి అరిగెల విజయకుమార్, వివిధ క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా వ్యాప్తంగా హెల్త్ చెకప్‌లు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై ఎస్పీ సీహెచ్ విజయారావు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల విధి నిర్వహణలో ఉండగా కొందరు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు గుండెపోటుతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది అందరికి హెల్త్‌చెకప్‌లు చేయించాలని ఎస్పీ నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం నెల్లూరు నగరంలోని అపోలో హాస్పిటల్లో నెల్లూరు నగర సబ్ డివిజన్, ట్రాఫిక్, దిశ, సీసీఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందికి, అదేవిధంగా అన్ని సబ్‌డివిజన్ల పరిధిలో హెల్త్ చెకప్‌లు నిర్వహించనున్నారు.

సోమశిలకు 372 క్యూసెక్కుల వరద



సోమశిల: సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి ఆదివారం నాటికి 372 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 700 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 55.256 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 97.265 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 318 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

కావలి పరిధిలో అనధికార లేఅవుట్



అనుమతులు జానా నై!

అనుమతులు తీసుకోరు.. నిబంధనలు పట్టించుకోరు.. ప్రభుత్వానికి పన్నులు చెల్లించరు. పొలాలను ఇతర అవసరాలకు మార్చేస్తారు. ఇదీ జిల్లాలో అనధికార లేఅవుట్లు వేస్తున్న వారి తీరు. కీలక శాఖలు ఆదిలోనే అడ్డుకోవాల్సి ఉన్నా కాసులు తీసుకుని మౌనంగా ఉంటున్నాయి. జిల్లాలో నుడా (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలో గతంలో 118 అనధికార లేఅవుట్లను గుర్తించినా తీసుకున్న చర్యలు నామమాత్రం. ఇటీవల నుడా పరిధి విస్తరించడంతో ఆ సంఖ్య 210కి చేరుకుని ఉంటుందని అధికారులు చెబుతున్న మాట.

- వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చేసి విక్రయాలు
- జిల్లాలో 210 అనధికార లేఅవుట్ల గుర్తింపు
- పెన్నా పరీవాహక, ఇరిగేషన్ భూములు ఆక్రమించి అమ్మకాలు
- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనే ఆక్రమణలు అధికం
- ప్లాట్లు కొని మోసపోతున్న కొనుగోలుదారులు
- అయినా ఉన్నతాధికారుల నుంచి చర్యలు శూన్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో నెల్లూరు, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, కావలి, ఆత్మకూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు అధికంగా ఉన్నాయి. సుమారు 4 వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. గతేడాది అక్టోబర్ వరకు 14 శాతం ఫీజు చెల్లించేలా ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ప్రభుత్వం కల్పించినా లేఅవట్ల యజమానులు పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే అనధికార లేఅవుట్ల జోలికి అధికార యంత్రాంగం వెళ్లదు కాబట్టే వారి నుంచి స్పందన కరువైందని ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా తమకేం పట్టనట్టు ఉంటున్నారు.

చర్యలెక్కడ?

జిల్లాలో పంచాయతీలు, పట్టణాభివృద్ధి సంస్థలనే తేడా లేకుండా అక్రమాలున్నాయి. గతంలో నుడా పరిధిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అనధికార లేఅవుట్లను గుర్తించిన జాబితాలు కీలక శాఖల దగ్గర ఉన్నాయి. అయినా ఉన్నతాధికారుల నుంచి నేటికీ చర్యలు లేవు. సంబంధిత అధికారులకు ముడుపులు అందతుండడంతో కఠిన చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆదాయం కంటే వారి జేబులు నింపుకొనే ధోరణిలోనే కొందరు అధికారులు ప్రవర్తిస్తున్నారని తెలుస్తోంది.

భూ రికార్డులు తారుమారు చేసి..


నెల్లూరు రూరల్ పరిధిలోనే అనధికార లేఅవుట్ల సంఖ్య అధికంగా ఉంటోంది. పెన్నా పరీవాహక ప్రాంతాలను, ఇరిగేషన్ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేసి విక్రయాలు చేసుకుంటున్నారు. ఇటీవల కనుపర్తిపాడు రెవెన్యూ పరిధిలో భూ రికార్డులు తారుమారు చేసి విక్రయాలు చేసుకుని సొమ్ము చేసుకున్నారు. స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం ఆగ్రహించి పూర్తి అఫిడవిట్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. కనుపర్తిపాడులోనే ప్రభుత్వ భూమి 62.52 ఎకరాలు, నీటి కుంటలు 128.05 ఎకరాలను ఆక్రమించి లేఅవుట్లు వేసి విక్రయించినట్లు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ స్వయంగా నెల్లూరు రూరల్ పరిధిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాల్సి వచ్చింది.

మరికొన్ని

- నెల్లూరు రూరల్ పరిధిలో నెల్లూరు – ముత్తుకూరు రహదారి వెంబడి సర్వే నంబర్ 1069 నుంచి 1072లో సుమారు 15.52 ఎకరాల భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేసి నుడా అప్రూవల్ లేకుండానే లేఅవుట్ వేసి ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు.
- నెల్లూరు రూరల్ పరిధిలో ధనలక్ష్మీపురంలో సుమారు 20 ఎకరాల్లో వేసిన లేఅవుట్‌కు నుడా నుంచి ఎలాంటి అనుమతి లేదు. వ్యవసాయేతర భూమిగా కూడా మార్పు చేయలేదు. రైతుల నుంచి కొనుగోలు చేసి వెంటనే రైతుల పేర్లమీదే లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం యంత్రాగానికి తెలిసినా పట్టించుకోవడం లేదు.
- నెల్లూరు రూరల్ ప్రాంతంలోని గుడిపల్లిపాడులో సర్వే నంబర్లు 544, 545లో 55 ఎకరాల పెన్నా పోరంబోకు భూములున్నాయి. వాటిలో సుమారు 19 ఎకరాల భూములను స్థానికంగా అక్రమార్కులు కబ్జా చేసి చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా కూడా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. వారికి ముందుగానే నగదు చేరి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- కావలి ప్రాంతంలో కూడా విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు విస్తరించి ఉన్నాయి. సర్వాయపాళెం రెవెన్యూ పరిధిలో టౌన్‌షిప్ పేరుతో సర్వే నంబర్లు 372, 374, 291 ఇంకా తదితర నంబర్లతో అనధికార లేఅవుట్లు వేసి నుడా అనుమతి లేకుండానే ప్లాట్లు విక్రయాలు చేస్తున్నారు. అంకణం రూ.50 వేలకే అంటూ రంగురంగుల బ్రోచర్లు వేసి వినియోగదారులను మోసం చేస్తున్నారు.

మోసపోతున్న వినియోగదారుడు

నుడా పరిధిలో లేఅవుట్‌కు అప్రూవల్ రావాలంటే ప్రధాన రహదారి, అంతర్గత రహదారులకు 40 అడుగులు వదలాలి. డీటీసీపీ అనుమతులకైతే ప్రధాన రహదారికి 40 అడుగులు, అంతర్గత రహదారులకయితే 33 అడుగులు వదలాలి. ఇలా ఎకరంలో రహదారులతోపాటు పదిశాతం ప్రజా అవసరాల కోసం ఓపెన్ స్పేస్‌కు ఇవ్వాలి. ఆపై వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమికి కన్వర్షన్ చేసేందుకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమి పట్టించుకోకుండా ఉండేందుకు భూమి విలువ ప్రకారం అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారు. దీనిపై పూర్తి అవగాహన లేని వినియోగదారుడు మాత్రం అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొనేందుకు అనుమతులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు.



నెల్లూరు రూరల్ కనుపర్తిపాడులో ప్రభుత్వ భూముల మ్యాప్

జరిమానా వసూలు చేస్తున్నాం

నుడా పరిధిలో అనధికార లేఅవుట్లను గుర్తించాం. చాలామందికి నోటీసులు ఇచ్చాం. పది లేఅవుట్ల యజమానుల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా రూపంలో వసూలు చేశాం. మిగిలిన వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం.
– బాపిరెడ్డి, నుడా వైస్ చైర్మన్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. షేక్ అల్తాఫ్ (42) బారాషహీద్ దర్గా వద్ద నివాసం ఉంటున్నాడు. అతను బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం భార్య, పిల్లలు అల్తాఫ్‌ను వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి అతను తన తండ్రి అమీర్‌తో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో కొండాయపాళెం గేటు వద్ద రైలు పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న రైలు అల్తాఫ్‌ను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ టి.ప్రభాకర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయికి మన విద్యార్థులు



ఎకో ఫ్రెండ్లీ ఫార్మర్ స్టిక్ ప్రాజెక్ట్



లో కాస్ట్ అండ్ హైఎఫిషియంట్ రోడ్ సేఫ్టీ సిస్టం ప్రాజెక్ట్



యాక్సిడెంట్ ప్రివెంట్ డివైజ్ ప్రాజెక్ట్

- ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు మూడు ప్రాజెక్ట్‌ల ఎంపిక

నెల్లూరు(టౌన్): ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా నుంచి మూడు ప్రాజెక్ట్‌లు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఈనెల 23, 24 తేదీల్లో కాకినాడలో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్‌ను నిర్వహించారు. జిల్లా నుంచి 26 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. బోగోలు మండలం బిట్రగుంట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎన్నాబత్తిన భావన ప్రదర్శించిన ఎకో ఫ్రెండ్లీ ఫార్మర్ స్టిక్, నెల్లూరు నగరంలోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన షేక్ సోనియా ప్రదర్శించిన లో కాస్ట్ అండ్ హై ఎఫిషియంట్ రోడ్ సేఫ్టీ సిస్టం, మనుబోలులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన తాటిపర్తి లక్ష్మి ప్రదర్శించిన యాక్సిడెంట్ ప్రివెంట్ డివైజ్ ప్రాజెక్ట్‌లు జాతీయస్థాయికి ఎంపికయ్యాయి. విద్యార్థులు, గైడ్ టీచర్లకు డీఈఓ గంగా భవాని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. జాతీయ ప్రదర్శనలో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

రెడ్‌క్రాస్ అందరిది.. ఐక్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ



హాజరైన సభ్యులు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- నెల్లూరులో రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం
- వాగ్వాదానికి దిగిన కొందరు సభ్యులు
- సర్దిచెప్పిన డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(అర్బన్): 'రెడ్‌క్రాస్ అందరిది. దీని ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు చేసేందుకు ఐక్యంగా పనిచేద్దాం.' అని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, మాజీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రతిష్టాత్మక ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగింది. తొలుత కోవిడ్‌తో మృతిచెందిన రెడ్‌క్రాస్ సభ్యులకు సంతాపం తెలిపారు. మాజీ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు రెడ్‌క్రాస్‌కు సంబంధించిన మూడేళ్ల నివేదికను ప్రవేశపెట్టి మాట్లాడారు. అందిన నిధులు, చేసిన ఖర్చులను పూర్తిస్థాయిలో వివరించారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాలపాటు వార్షిక సమావేశాలు నిర్వహించలేకపోయామన్నారు. కఠిన లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులకు, అనాథల కోసం రెడ్‌క్రాస్ తరఫున ఐదు పునావారాస కేంద్రాలు ఏర్పాటు చేసి 85 వేల భోజనాలు అందించామన్నారు. 90 రోజులపాటు 120 మంది వలంటీర్లు సేవలందించారన్నారు. ఆక్సిజన్ రథచక్రాలు, ఆక్సిజన్ బ్యాంక్, మెడికల్ కిట్లను కోవిడ్ బాధితుల కోసం ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్మా సేకరణలో దేశంలోనే రెండో స్థానంలో నెల్లూరు రెడ్‌క్రాస్ నిలిచిందన్నారు. మానసిక దివ్యాంగులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. వరదల సమయంలో వందలాది మందిని ఆదుకున్నామన్నారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. క్యాన్సర్ ఆస్పత్రి, జనరిక్ మెడికల్ షాపు, గాంధీజీ ఆశ్రమం, ఏఆర్‌వీ సెంటర్ ఇలా 13 అనుబంధ శాఖలతో సేవలందిస్తున్నామన్నారు.

వాగ్వాదానికి దిగిన సభ్యులు

సమావేశం జరుగుతుండగా రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు కాకు మురళి, భాస్కర్, రామకృష్ణ తదితరులు వాగ్వాదనకు దిగారు. ఒకేరోజు సర్వసభ్య సమావేశం, నామినేషన్ల స్వీకరణ ఎలా చేస్తారన్నారు. మండలాల స్థాయిలో సబ్ కమిటీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈక్రమంలో వాద, ప్రతివాదనలు జరిగాయి.

రెడ్‌క్రాస్‌కు మంచిపేరు

రెడ్‌క్రాస్ ప్రత్యేక అధికారి, డీఆర్వో వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ దేశంలోనే నెల్లూరు రెడ్‌క్రాస్‌కు మంచి పేరుందన్నారు. దానిని వమ్ము చేయొద్దన్నారు. వాదనలకు దిగొద్దని హితవు పలికారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ చక్రధర్‌బాబు సూచనల మేరకు వీలైనంత వరకు ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకోవాలన్నారు. తర్వాత ఎన్నికల అధికారి తిరుపాల్‌రెడ్డి నామినేషన్లు వేయాలని సూచించారు.

మరోసారి

పరిస్థితి సద్దుమణిగిందనుకుంటున్న సమయంలో వేదికపై ఉన్న రెడ్‌క్రాస్ కమిటీ నాయకుడు ఢాకారపు రవిప్రకాష్ వాగ్వాదానికి దిగిన నేతలను విమర్శించారు. దీంతో రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు, న్యాయవాదులైన చుక్కా రమేష్, విద్యాచరణ్, రాజా ఒక్కసారిగా ఆవేశంగా మాట్లాడుతూ సవాల్ చేస్తే సహించేది లేదన్నారు. తాము కూడా తేల్చుకుంటామంటూ మాట్లాడారు. ఈ సమయంలో సభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్వో వాదనలు వద్దని పదేపదే విజ్ఞప్తి చేశారు. సభను చక్కదిద్దారు.

మిన్నగా సేవలందించాం

చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను డిసెంబర్ నుంచి అందుబాటులో లేనన్నారు. కలెక్టర్‌కి చెప్పి బాధ్యతలను వేరేవారికి అప్పగించానన్నారు. తనకు తెలిసి ప్రజలకు గతంలో కన్నా ఎంతో మిన్నగా సేవలందించామన్నారు. చేసిన సేవలను వివరించారు. సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలపాలన్నారు. ఇక్కడ సేవ చేసేందుకు మాత్రమే సభ్యులుగా చేరతారన్నారు. ఆవేశాలు వద్దని, అందరం కలిసి ప్రజలకు సేవ చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో రెడ్‌క్రాస్ కమిటీ జిల్లా కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, ఎంసీ మెంబర్లు బయ్యా ప్రసాద్, రవిప్రకాష్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, ప్రసన్నాంజనేయులు, యాల మూరి రంగయ్యనాయుడు, సురేష్, రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్‌రెడ్డి, జీవిత సభ్యులు పాల్గొన్నారు.



వాగ్వాదానికి దిగిన పలువురు సభ్యులు

నామినేషన్ల స్వీకరణ

రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా కమిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు ఆదివారం జిల్లా సహకార శాఖాధికారి తిరుపాల్‌రెడ్డి కస్తూర్బా కళాక్షేత్రంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. 18 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అంటే ఒక్కో ఓటరు 18 ఓట్లు వేయాలి. గత నెల వరకు చైర్మన్‌గా ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మొత్తం 57 మంది నామినేషన్లు వేశారు. కాగా ఎన్నికల అధికారి తిరుపాల్‌రెడ్డి రెండు నామినేషన్లు తిరస్కరించారు. ఓ వ్యక్తి డబుల్ నామినేషన్ వేశారు. ఆరుగురు ఉపసంహరించుకున్నారు. 49 మంది పోటీలో ఉన్నారు. వచ్చే నెల 2వ తేదీన ఎన్నికలను జరిపించాల్సి ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. కాగా కొంతమంది రాజీ చర్చలు జరుపుతున్నారు. ఆదివారం రాత్రి కలెక్టర్ చక్రధర్‌బాబును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఎన్నికలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు చెబుతున్నారు.



నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి

■ హాయిగా పనిచేసుకుంటూ..



ఓ వైపు భగభగమంటున్న భానుడు.. మరోవైపు మిర్చి ఘాటు.. అవేమి పట్టించుకోకుండా మహిళా రైతులు తలకు గుడ్డ చుట్టుకుని ఘాటును భరిస్తూ హాయిగా పనిచేసుకుంటున్నారు. కావలి వద్ద కోతల అనంతరం ఎండుమిర్చిని ఆరబెడుతుండగా తీసిన చిత్రం. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శేషులు

నెల్లూరు(టౌన్): యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వీవీ శేషులు నియమితులయ్యారు. నెల్లూరులోని జేఎస్ ట్రస్ట్‌లో యూటీఎఫ్ జిల్లా 48వ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడిగా అచ్చయ్య, విజయకుమారి, ప్రధాన కార్యదర్శిగా చలపతిశర్మ, కోశాధికారిగా మురళీధర్‌రావు నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ వ్యవహరించారు. అనంతరం ఆర్థిక నివేదిక, జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం ఆడిట్ నివేదిక ప్రవేశపెట్టగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఉలవపాడు: కారు మోటార్‌బైక్‌ను ఢీకొని డివైడర్‌పై బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కేరళ రాష్ట్రం నుంచి బేకరీ నిర్వాహకులు జగ్గయ్యపేటకు తమ సొంత కారులో వెళ్తున్నారు. తిరపతయ్య అనే వ్యక్తి గుడ్లూరు నుంచి కరేడుకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో కరేడు ర్యాంపు వద్ద అతను మలుపు తిరుగుతున్న సమయంలో కారు బైకును ఢీకొని డివైడర్‌పై బోల్తా పడింది. కారులో ఉన్న అలీఅక్బర్ సోహైల్, తిరుపతయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

వాణిజ్య ప్రయోగాల్లో అద్వితీయం

అంతరిక్ష పరిశోధనల్లో భారత ఖ్యాతి ఇనుమడించింది. ప్రపంచ దేశాల్లో తిరుగులేని శక్తిగా అవతరించింది. వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగంలో మరోసారి విజయకేతనం ఎగురవేసింది. ఇస్రో బాహుబలిగా పేరు గాంచిన జీఎస్ఎల్వీ (ఎల్వీఎం3- ఎం3) రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి సురక్షితంగా శాటిలైట్లను ప్రవేశపెట్టింది. ప్రతిష్టాత్మక ప్రయోగం జయప్రదం కావడంతో షార్ శాస్త్రవేత్తల సంబరం అంబరాన్నంటింది.

- ఎల్వీఎం3-ఎం3 సిరీస్‌లో రెండో వాణిజ్య ప్రయోగం సూపర్ సక్సెస్
- నిర్దేశిత కక్ష్యలోకి చేరిన 36 ఉపగ్రహాలు
- ఫలించిన షార్ శాస్త్రవేత్తల కృషి
- ఇనుమడించిన ఇస్రో ఖ్యాతి

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం ఉదయం 9 గంటల 20 సెకండ్లకు ఎల్వీఎం 3-ఎం3 ఉపగ్రహ వాహకనౌకను విజయవంతంగా ప్రయోగించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్ వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో 36 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. కేవలం 97 నిమిషాల్లోనే భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో సురక్షితంగా ప్రవేశపెట్టింది. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరు గాంచిన ఎల్వీఎం3-ఎం3 లాంటి భారీ రాకెట్‌ను కూడా వాణిజ్యపరమైన ప్రయోగాలకు ఉపయోగించడం ఇది రెండోసారి కావడం విశేషం. దీంతో ఎల్వీఎం3-ఎం3 రాకెట్ కూడా గ్లోబల్ కమర్షియల్ లాంచ్ సర్వీస్ మార్కెట్లోకి ప్రవేశించింది.

శాస్త్రవేత్తల సంబరం

ఆదివారం ఉదయం కౌంట్‌డౌన్ పూర్తి కావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పెద్ద శబ్దంతో ఎల్వీఎం3-ఎం3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ 5,805 కిలోల బరువు కలిగిన వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను మోసుకుని నింగికేగింది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసి మూడో దశలో అమర్చిన సీ-25 అంటే 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో దూసుకెళ్లింది. రాకెట్ శిఖర భాగంలో అమర్చిన 36 ఉపగ్రహాలను నాలుగేసి ఉపగ్రహాల చొప్పున 9 సార్లుగా 97 (1.37 గంటల వ్యవధిలో) నిమిషాలకు దిగ్విజయంగా నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఎల్వీఎం 3-ఎం3 రాకెట్ వరుసగా ఆరోసారి విజయం సాధించడంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

దశలవారీగా ప్రయోగ క్రమం ఇలా..

- ఎల్వీఎం3-ఎం3 రాకెట్ 43.5 పొడవు కలిగి 643 టన్నుల బరువుతో నింగివైపునకు దూసుకెళ్లింది. ఆరు ఉపగ్రహాలను రోదసీలోకి మోసుకెళ్లింది.
- మొదటి దశలో రాకెట్‌కు ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్-200 బూస్టర్ల సాయంతో నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి బయలుదేరింది.
- రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 136.5 సెకండ్లలో మొదటి దశను పూర్తి చేశారు.
- 185.5 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాలకు అమర్చిన దశలో హీట్‌షీల్డ్స్ విజయవంతంగా విడిపోయాయి.
- ఎల్-110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 306.7 సెకండ్లకు రెండోదశను పూర్తి చేశారు.
- సీ-25 అంటే 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి 933.1 సెకండ్లకు మూడోదశను పూర్తి చేశారు.
- వన్‌వెబ్ ఇండియా- 2 పేరుతో అమర్చిన 36 ఉపగ్రహాలను క్రయోజనిక్ దశతో 1174.6 సెకండ్లకు భూమికి దగ్గరగా 450 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఎర్త్ ఆర్బిట్‌లో 87.4 డిగ్రీల వంపుతో వృత్తాకార కక్ష్యలో మొదటిగా నాలుగు ఉపగ్రహాలను (1కే, 3కే, 5కే, 7కే) ప్రవేశపెట్టారు.
- 204.6 సెకండ్లకు మరో నాలుగు ఉపగ్రహాలు (2ఏ, 4ఏ, 6ఏ, 8ఏ) ప్రవేశపెట్టారు.
- 004.6 సెకండ్లకు ఇంకో నాలుగు ఉపగ్రహాలు(1ఏ, 3ఏ, 5ఏ, 7ఏ) ప్రవేశపెట్టారు.
- 2034.6 సెకండ్లకు మరో నాలుగు ఉపగ్రహాలు (2బీ, 4బీ, 6బీ, 8బీ)ను ప్రవేశపెట్టారు.
- గంట పాటు గ్యాప్ తీసుకుని 37 నిమిషాల్లో మిగిలిన 20 ఉపగ్రహాలను నాలుగేసి చొప్పున విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
- 1.37 (గంట ముప్పై ఏడు నిమిషాలకు) గంటలకు ప్రయోగాన్ని విజయవంతగా పూర్తి చేశారు.



రోదసీలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం3 రాకెట్

- ప్రయోగానంతరం యూకేకు చెందిన అంటార్కిటికా గ్రౌండ్‌స్టేషన్ వారు ఉపగ్రహాలను అధీనంలోకి తీసుకున్నారు. అన్నీ సక్రమంగా పనిచేస్తున్నట్లుగా సిగ్నల్స్ అందాయని ప్రకటించారు.

వీక్షకుల గ్యాలరీలో సందడి

రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి సుమారు పది వేల మందికి పైగా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు పెద్దసంఖ్యలో బారులు తీరాయి. సందర్శకులు రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలో షార్ అధికారులు ఒక ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. అలాగే పులికాట్ సరస్సు వద్ద రోడ్డుపై సైతం భారీగా జనం చేరుకున్నారు. రాకెట్ నింగిలోకి దూసుకెళ్తుంటే ప్రజలు ఉత్సాహంగా చప్పట్లు, ఈలలతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని గ్యాలరీ నుంచి ప్రయోగాన్ని వీక్షిస్తున్న సందర్శకులు

శాస్త్రవేత్తలకు అభినందనలు

ఎల్వీఎం3-ఎం3 ప్రయోగాన్ని విజయవంతం కావడంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వాణిజ్యపరమైన ప్రయోగాలు చేయడంలో మరోసారి సత్తాచాటారని కొనియాడారు. అలాగే శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సైతం రాకెట్ ప్రయోగంపై స్పందించారు. దేశ ప్రతిష్టను పెంచిన ఇస్రో చైర్మన్ కె.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్యపరంగా ఇది ఘన విజయమని ప్రశంసించారు.





క్లుప్తంగా

శ్రీనివాసం గోల్డెన్ సిటీ వెంచర్ ప్రారంభం



వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని కాకుపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీనివాసం గోల్డెన్ సిటీ వెంచర్‌ను ఆదివారం ప్రారంభించారు. సినీ నటి, ఎఫ్-3 ఫేమ్ మెహ్రీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వెంచర్ నిర్మాణకులు నాగేశ్వరరావుగౌడ్, వంశీకృష్ణగౌడ్, అప్సర్‌బాషా, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సినీనటులు సందడి చేశారు.


పెన్నానదిలో పడి వ్యక్తి మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్)

కోవూరు : ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి పశువుల కాపరి మృతిచెందిన ఘటన కోవూరు మండలం జమ్మిపాళెం వద్ద ఆదివారం ఉదయం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం ఈదూరు ప్రాంతానికి చెందిన వెంపులూరి సుబ్రహ్మణ్యం(55) జమ్మిపాళెంలోని గుత్తికొండ రవీంద్ర ఇంట్లో పశువుల కాపరిగా గత ఆరు మాసాల నుంచి పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం పశువులు తోలుకుని సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రానికి పశువులు ఇంటికి వచ్చినా ఆయన మాత్రం రాలేదు. దీంతో సుబ్రహ్మణ్యం కోసం రెండు రోజుల పాటు గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం పెన్నానది ఒడ్డున మృతదేహం కొట్టుకొచ్చిందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అది సుబ్రహ్మణ్యంగా భావించి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించి నిర్ధారణ చేసుకున్నారు. సుబ్రహ్మణ్యంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు తెలిపారు.

సాగరతీరంలో సందడి



తోటపల్లిగూడూరు : ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌లో పర్యాటకుల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. నెల్లూరుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు కుటుంబ సమేతంగా పోటెత్తడంతో కోడూరు బీచ్‌లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటలకే ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 వరకు కొనసాగింది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి బీచ్‌లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.75
పండ్లు	: రూ.30

వైఎస్సార్‌సీపీ వల్లే దశాబ్దాల కల సాకారం

- 313 మందికి పట్టాలు అందించడం ఆత్మ సంతృప్తినిచ్చింది
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : పేద రైతుల దశాబ్దాల నాటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే సాకారమైందని, వారికి భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం తనకు ఎంతో ఆత్మ సంతృప్తి నిచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలంలోని పుంజులూరుపాడు బహిరంగ సభలో రైతులకు భూహక్కు పత్రాలను మంత్రి కాకాణి చేతులమీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుంజులూరుపాడు, ఎగువమిట్ట, గుడివాడ తోపు, మొలకలపూడి గ్రామాలకు చెందిన 313 మంది రైతులకు 320 ఎకరాల కామినేని చెరువు భూమిలో భూహక్కు పత్రాలను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కామినేని చెరువు కింద ఉన్న ప్రభుత్వ భూములకు అప్పటి కలెక్టర్ అర్జున్‌రావు సీజేఎఫ్ఎస్ పట్టాలు పంపిణీ చేశారన్నారు. అయితే చంద్రబాబు హయాంలో ఆ సీజేఎఫ్ఎస్ పట్టాలను రద్దు చేసి రైతులకు డీఫారం పట్టాలు పంపిణీ చేస్తానని నమ్మించి మోసం చేసిందని గుర్తు చేశారు. రైతుల అనుభవంలో ఉండి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని టీడీపీ హయాంలో రైతులు కాళ్లరిగేలా తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యను రైతులు తన దృష్టికి తీసుకురావడంతో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం రైతుల సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రైతులకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.



భూహక్కు నమూనా పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బాబు హయాంలో కరువు విలయతాండవం

చంద్రబాబు అధికారంలో ఉంటే రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుందని మంత్రి కాకాణి విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు విజయం సాధించగానే చంద్రబాబు చంకలు గుద్దుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హయాంలో చేసిన పాపాలను తాము ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రజల పక్షాన నిలుస్తున్నామని తెలియజేశారు. కామినేని చెరువు రైతుల సమస్యను చంద్రబాబు పరిష్కరించకుండా మోసం చేస్తే తాము రైతుల కళ్లల్లో ఆనందం నింపుతూ భూహక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు వివరించారు. రామదాసుకండ్రిగ, ఇడిమేపల్లి గ్రామాలకు సాగునీరు అందించేందుకు సొంత నిధులు వెచ్చించేందుకు సైతం వెనుకాడకుండా పనులు చేయించామన్నారు. అయితే ఈ పనులు పూర్తయితే తనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని టీడీపీ నేతలు అడుగడుగునా కాలువ నిర్మాణ పనులను అడ్డుకునే కుట్రలు చేశారని మండిపడ్డారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లో పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, తహసీల్దార్ పి.కృష్ణ, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కోడూరు రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రచనలతో సమాజాన్ని జాగృతం చేయాలి

నెల్లూరు(బృందావనం) : సమాజ హితాన్ని కాంక్షించే రచనలతో కవులు జాగృతం చేయాలని మల్కాజ్‌గిరి అడిషనల్ కలెక్టర్ నరసింహారెడ్డి కోరారు. ఉగాది పురస్కారాల ప్రదాన సభ, జాతీయ స్థాయి కవి సమ్మేళనాన్ని నగరంలోని పురమందిరంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తిక్కన మహాకవి, దువ్వూరి రామిరెడ్డి, పట్టాభి, బెజవాడ గోపాల్‌రెడ్డి, ఆత్రేయ, తదితర సాహితీవేత్తలకు జన్మనిచ్చిన నెల్లూరు సీమ ఎంతో ఉన్నతమైందని చెప్పారు. నెల్లూరుకు తొలిసారిగా వచ్చానని, పురమందిర వేదికపై నుంచి ఉపన్యసించడాన్ని తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. తెలుగు భాషపై ఆదరాభిమానాలు సన్నగిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని గుంటూరుకు చెందిన కవి వెంకటేశ్వర్లుకు అందజేశారు. నెల్లూరుకు చెందిన కవి రామచంద్రప్రసాద్‌కు పద్యకళానిధి బిరుదు, జిల్లా తొలి నవలా రచయిత్రి బిరుదును పెళ్లకూరు జయప్రదకు అందజేసి సత్కరించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 150 మంది కవులతో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపై తమ కవితలను వినిపించి సభికుల హర్షధ్వానాలను అందుకున్నారు.



వైఎస్సార్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నెరసం సాహితీ పురస్కారాల అందజేత

కవులు వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, కలిమిశ్రీ, వెంకటశ్రీనివాసులు, ప్రకాష్, శాంతికృష్ణ, విల్సన్, నారాయణరావుకు నెరసం సాహిత్య సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. మాణిక్యమ్మ స్మారక రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారాన్ని వంశీకృష్ణ 'రెప్పవాలని రాత్రి' కవితా సంపుటికి అందజేశారు.

పుస్తకాల ఆవిష్కరణ

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవిత చరిత్ర, రాజకీయ ప్రస్థానం, తదితర విశేషాలను వివరిస్తూ అశోక్‌కుమార్ రచించిన 'తమసోమా జ్యోతిర్గమయ' పుస్తకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. తెలంగాణకు చెందిన కవి సుధాకర్‌రెడ్డి రచించిన 'ముదు ఘంటికలు'ను ఆవిష్కరించారు. లాయర్ వారపత్రిక సంపాదకుడు శివప్రభాత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రంథాలను పుస్తక బహుమతిగా అందజేశారు. విశ్రాంత అధికారి పెంచలరెడ్డి, మోడరన్ విద్యాసంస్థల అధినేత విజయకుమార్‌రెడ్డి, హరినారాయణరెడ్డి, కృష్ణా జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పూర్ణచందు, వెంకటరత్నం, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, విద్యాధర్‌రావు, అరుణ, అంకమ్మరావు, నెరసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన

వింజమూరు : ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తీరుపై వింజమూరు పట్టణంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు పల్లాల కొండారెడ్డి, వనిపెంట వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను పాడెపై ఊరేగించి దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డి అని తెలిపారు. ఆయన చంద్రబాబు ఇచ్చిన డబ్బులకు అమ్ముడుపోయారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు చూసి ఓటు వేశారని గుర్తుచేశారు. ఓటు వేసి ప్రజలను, నమ్ముకున్న నాయకులను వంచించారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంగి రమణయ్య, నాయకులు తాటిచెట్ల కాలేషా, మద్దిరెడ్డి వీరారెడ్డి, జయంత్‌రెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, రామసుబ్బారెడ్డి, కర్నాటి రామిరెడ్డి, గూడా చంద్రారెడ్డి, కొంకల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు